సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



## దేవీ.. డబ్బులేవీ..?

నౌపడలో ఓ మహిళ రూ.కోటి వసూలు చేసింది. తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. - 8లో



## తల్లిదండ్రుల ధర్నా

పెద్దమడి గిరిజన సంక్షేమ పాఠశాలలో తల్లిదండ్రులు ధర్నా చేశారు. పాఠాలు చెప్పేవారు లేరంటున్నారు. - 8లో

## బాబోయ్ కోతులు



మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధిలోని టీకేఆర్ పురం తదితర గ్రామాల్లో ఆదివారం పదుల సంఖ్యలో కోతి పిల్లలు దర్శనమిచ్చాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చిన్న చిన్న కోతిపిల్లలకు కొంత మంది స్థానికులు ఆహారం అందించారు.

## న్యూస్‌రీల్

### అధినేత ఆలోచనల మేరకు నడుచుకోవాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు అక్కడి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. అధినేత ఆలోచనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. సమన్వయకర్తను విభేదిస్తూ ఆరోపణలు చేయడం సరికాదని, నక్కా ప్రసాద్, ఆబోతుల జగన్నాథం తదితర నాయకులు పార్టీ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని కోరారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఎంతటి వారిపైనైనా క్రమశిక్షణ చర్యలు తప్పవని కృష్ణదాస్ హెచ్చరించారు. సమన్వయకర్తతో కలిసి పనిచేసి, పార్టీ పటిష్టతకు పాటు పడాలని కోరారు.

### గణిత మేధావికి ఘనమైన నివాళి



పాతపట్నం మండలంలోని కాగువాడ గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిభా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(ఎంజేబీపీఆర్)లో ప్రధానోపాధ్యాయురాలు శ్రీరాములు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా 1729 రామానుజన్ సంఖ్య ఆకారంలో విద్యార్థినులు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

- పాతపట్నం

### బీఆర్‌ఏయూకు పీఎం ఉషా కింద రూ. 20 కోట్లు మంజూరు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి పీఎం ఉషా కింద (ప్రధాన్ మంత్రి ఉచ్చతార్ శిక్ష అభియాన్) రూ. 20 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ వివరాలు ఉత్తర్వులు అందజేసింది. గతంలో అధికారులు ప్రతిపాదనల మేరకు ఈ నిధులు మంజూరయ్యాయి. ఐటెప్ కోర్సు అకడమిక్ బిల్డింగ్, ఇంజినీరింగ్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్, మహిళలు వసతి గృహం వంటి ప్రపోజల్స్ అధికారులు అందజేశారు. దేశంలో చాలా విద్యా సంస్థలకు పీఎం ఉషా పథకంలో భాగంగా నిధులు మంజూరయ్యాయి.

### ఆదిత్యునికి విశేష పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు తలనీలాల మొక్కులు చెల్లించుకోగా, ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వై.భద్రాజీ తగు చర్యలు చేపట్టగా, అంతరాలయంలో గోత్రనామాలతో పూజలు జరిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. అలాగే దర్శన టిక్కెట్ల ద్వారా రూ.62,500, విరాళాలు, ప్రత్యేక పూజల టిక్కెట్ల ద్వారా రూ.83,459, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.50 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

## ● పేరు కోసం ప్రకటన..

# నిధులివ్వకుండా నటన

- పబ్లిసిటీ కోసం కూటమి ప్రభుత్వం ఆరాటం
- నాడు కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు
- ఒక్కపైసా కూడా నిధులు విదల్చని వైనం
- తాజాగా అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ జీఓ జారీ
- ఆలయ నిధులే వినియోగించుకోవాలని వింత సలహా





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

కూటమి ప్రభుత్వ ప్రచార యావ పతాకస్థాయికి చేరుకుంటోంది. జిల్లాలో అతిముఖ్యమైన పండగలను రాష్ట్ర పండుగలుగా గుర్తిస్తున్నట్లు జీఓలు జారీ చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఉత్సవాల నిర్వహణకు దమ్మిడీ కూడా సాయం చేయకుండా వింత వైఖరి ప్రదర్శిస్తోంది. పండగగా గుర్తిస్తున్నామే తప్ప ఎలాంటి నిధులిచ్చేది లేదని అదే జీఓలో ప్రత్యేకంగా పేర్కొంటోంది.

ఆ మధ్య కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలకు ఇదే రకంగా రాష్ట్రపండగా గుర్తిస్తూ జీఓ ఇచ్చి, నిధులివ్వకుండా చేతులు దులుపుకుంది. రాష్ట్ర పండగగా గుర్తించాక అక్టోబర్ నెలలో జరిగిన జాతర మహోత్సవాల్లో ప్రత్యేకత ఏమీ కనిపించలేదు. ఏటా జరిగినట్టుగానే జరిగాయి. కానీ కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలను రాష్ట్ర పండగగా చేసేశామని పాలకపక్ష నేతలు మాత్రం తెగ హడావుడి చేశారు.

**ఆదిత్యుడికీ అదే మంత్రం**



ఫిబ్రవరి 2న సూర్య జయంతి సందర్భంగా జరగనున్న అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలను కూడా రాష్ట్ర పండగగా గుర్తిస్తూ తాజాగా ప్రభుత్వం జీఓ ఇచ్చింది. పాలక పక్ష నేతల సిఫార్సుల మేరకు దేవదాయ శాఖ ప్రతిపాదనల మేరకు రాష్ట్ర పండగగా గుర్తిస్తున్నట్టుగా ప్రభుత్వం జీఓ జారీ చేసింది. కానీ ఉత్సవ నిర్వహణకు ఒక్క పైసా ప్రత్యేకంగా ఇచ్చేది లేదని తేల్చి చెప్పేసింది. దేవస్థానం నిధులతోనే రాష్ట్ర పండగగా జరుపుకోవాలని ఉచిత సలహా కూడా ఇచ్చింది. పేపర్లలో రాష్ట్ర పండగ తప్ప ప్రత్యేకత ఏమీ లేదని ప్రభుత్వమే జీఓ ద్వారా చెప్పేసింది.

**ఒరిగిందేమిటి..?**

రాష్ట్ర పండగగా గుర్తించడం వల్ల ఈ ఉత్సవాలకు ఒరిగిందేమి ఏమిటీ అంటే ఏమీ లేదు. దేవస్థానానికి వచ్చే భక్తులు, దాతల ద్వారా వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వం చెప్పినట్టుగా రాష్ట్ర పండగగా చేసుకోవాలి. ఈ మాత్రం దానికి రాష్ట్ర పండగగా చెప్పుకోవడంలో అర్థమేమిటో పాలకులే చెప్పాలి. డిజిటలైజేషన్ పెరిగిన తర్వాత కాగితం కూడా వినియోగించే పరిస్థితి లేదు. ఆ భారం కూడా ప్రభుత్వానికి తప్పిందనుకోవాలి.

**అవసరాలెన్నో..**

రథసప్తమి వేడుకల సమయంలో భక్తులు భారీగా వస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. దీంతో వీరికి విశ్రాంతి తీసుకునేందుకు వసతి అవసరం ఉంటుంది. ప్రస్తుతం దేవస్థానం పరిధిలో 26గదులు ఉన్నాయి. కానీ ఇవి పోలీసులు, మఠాధిపతులకే సరిపోతాయి. దీంతో సామాన్య భక్తులకు గదులు దొరకవు. ఈ సమస్య పరిష్కరించేలా రాష్ట్ర పండగ గుర్తింపులో భాగంగా ప్రత్యేక నిధులిస్తే బాగుండేది. కనీసం విశ్రాంతి మండపాలైనా నిర్మించాలి. స్నానపు గదులు, మల, మూత్ర విసర్జన శాలలు మరింత ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. మాడవీధులు అభివృద్ధి జరగాల్సి ఉంది. వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాల్లేవు. దానికోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో ఇవన్నీ చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపి ఉంటే బాగుండేదని ప్రజలంటున్నారు.

### జీఓతో హడావుడి

రాష్ట్ర పండగ కింద ఒక్క పైసా తీసుకురాని కూటమి నాయకులు మాత్రం ఈ జీఓను తమ ఘనతగా చెప్పుకుంటున్నారు. ప్రసాదం స్కీం కింద కేంద్ర ప్రభుత్వానికి వెళ్లిన రూ. 76కోట్ల ప్రతిపాదనలను రూ. 100కోట్లుగా చూపించి, అభివృద్ధి చేసేస్తున్నామని తాజా జీఓలో ఉటంకిస్తున్నారు. గత ప్రభుత్వం ఇంద్ర పుష్కరిణి కోసం ప్రత్యేకంగా రూ. 2కోట్లు విడుదల చేసింది. మరో రూ. 2కోట్లు దేవస్థానం నుంచి కేటాయిస్తూ అభివృద్ధి పనులకు ఉపక్రమించింది. కానీ కాంట్రాక్టర్ సమస్యతో పనులు ముందుకు సాగలేదు. ఈ ప్రభుత్వం వీటికి అదనంగా నిధులు ఇచ్చి అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తే బాగుండేది. కానీ ఆ పని చేయకుండా పైసా నిధులివ్వకుండా రాష్ట్ర పండగగా గుర్తిస్తున్నట్టుగా విడుదల చేసిన జీఓ కేవలం ప్రచారమేననే వాదన వినిపిస్తోంది.



అరసవల్లి సూర్య నారాయణ స్వామి రథసప్తమి వేడుకలను మూడు రోజుల రాష్ట్ర పండగగా గుర్తిస్తూ... ప్రత్యేక ఆర్థిక సాయం లేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ

## 1100 సీసీ కెమెరాలు అవసరం: ఎస్పీ



ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో చైన్‌స్నాచింగ్‌లు, చోరీలు పెరుగుతున్నా వాటిని ప్రణాళికాబద్ధంగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కేసుల గుర్తింపు శాతం 1.5 రెట్లు పెరిగిందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశీబుగ్గ, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో తోటల్లో సింగిల్‌గా ఇళ్లుండటంతో దొంగతనాలకు ఆస్కారమవుతుందన్నారు. పట్టణాలు, ముఖ్యకేంద్రాలు, కూడళ్లలో సీసీ కెమెరాలున్నా అలాంటి ప్రాంతాల్లో ఉండకపోవడంతో ఇబ్బందవుతుందన్నారు. ఇప్పటికే 900కు పైగా సీసీ కెమెరాలున్నా 1100కు పైగా ఉంటేనే చోరీలు అరికట్టేందుకు సులవవుతుందని, సీఎస్ఆర్ ఫండ్స్, పోలీసింగ్ ఫండ్సే కాక పబ్లిక్ నుంచి దాతల సహకారంతో మరిన్ని ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు. చోరీలు చేసే అంతర్రాష్ట్ర గ్యాంగులు రెండింటిని గుర్తించామని, జిల్లాలోని కొన్ని ప్రాంతాల యువకులు స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని అన్నారు.

## ● మార్గం.. దుర్మార్గం



ధర్మపురం వద్ద ప్యాచ్‌వర్క్ పరిస్థితి



తిప్పనపుట్టుగ జంక్షన్ నుంచి కేశుపురం వెళ్లే రోడ్డు

చిత్రంలో కనిపిస్తున్న దారులు ఇచ్ఛాపురం మండలంలోనివి. తులసిగాం నుంచి కేశుపురం వరకు గోతులు పూడ్చడానికి సుమారు రూ.15లక్షలతో ఇరవై రోజుల కిందట స్థానిక ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ ఈదుపురం వద్ద కొబ్బరికాయ కొట్టారు. పది రోజుల తర్వాత గుంతల్లో రాళ్లు వేశారు. బుధవారం రాత్రి సమయంలో హాట్‌మిక్సర్‌లో తారు, చిప్స్ కలిపి హడావుడిగా తిప్పనపుట్టుగ జంక్షన్ రోడ్డు వరకు ప్యాచ్‌వర్క్ చేశారు. గురువారం నుంచి వానలు కురవడంతో రోడ్డు అసలు రూపం బయటపడింది. తారు శాతం పూర్తిగా తక్కువగా ఉండటం వల్ల చిప్స్ తేలిపోయాయి. ఈ పనితనాన్ని చూసి జనం ముక్కున వేలేసుకున్నారు.

- ఇచ్ఛాపురం రూరల్

## 33 టన్నుల జీడిపప్పు దగ్ధం



హరిపురం జీడి పరిశ్రమలో మంటలు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం గ్రామంలో ఉన్న వెంకటబాలాజీ కాష్యూ పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి దాటిన అనంతరం మంటలు చెలరేగాయి. ఎగుమతులకు సిద్ధంగా 33 టన్నుల జీడిపప్పు కాలి బూడిదైందని పరిశ్రమదారులు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పలాస, మందస అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేసినప్పటికీ రూ.2.50 కోట్ల విలువైన 33 టన్నుల జీడిపప్పు కాలిపోయినట్లు ఫైర్ సిబ్బంది నిర్ధారించారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు పరిశీలించగా మందస పోలీసు స్టేషన్‌వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పులు తీర్చేందుకు ▸ తప్పులు



తల్లి ఆస్పత్రి ఖర్చుల కోసం దొరికిన కాడికి అప్పు చేశాడు. తల్లి చనిపోయాక ఆ అప్పులు తీర్చలేక పోయాడు. సులభంగా డబ్బులు దొరికే మార్గాలు వెతికాడు. ఆఖరుకు దొంగగా మారి మహిళల మెడలోని బంగారు గొలుసులు కాజేసే పనికి ఒడిగట్టాడు. ఆ క్రమంలో మహిళపై దాడి చేసేందుకు కూడా వెనుకాడలేదు. వరుసగా ఆరు చోరీలు చేసి ఆ బంగారాన్ని విక్రయించేందుకు వెళ్తూ పోలీసులకు దొరికిపోయాడు. కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందిన నర్తు రాజేష్ (24)ను పోలీసులు అరెస్టు చేశారు.

- ఆరు చోరీల్లో నిందితుడైన భైరిపురం యువకుడు అరెస్టు
- మహిళల మెడలోని గొలుసులే లక్ష్యంగా చోరీలు
- సొంతగ్రామ ఉపాధ్యాయురాలిపైనా దాడి
- రూ.7.76 లక్షల విలువైన 8 తులాల బంగారం స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, పక్కనే డీఎస్పీ వి.వి.అప్పారావు, సీఐ, ఎస్ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో వరుసగా గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నర్తు రాజేష్ (24)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. నవంబరు, డిసెంబరు మాసాల్లో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం టౌన్ పీఎస్‌ల పరిధిలో ఆరు వరుస చోరీలు చేసి రూ. 7.76 లక్షల విలువ చేసే ఎనిమిది తులాలకు పైగా బంగారాన్ని కాజేశాడు. ఎట్టకేలకు కాశీబుగ్గ డీఎస్పీ వీవీ అప్పారావు ఆధ్వర్యంలోని ఇచ్ఛాపురం, కవిటి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు ఆదివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

**అప్పుల పాలవ్వడంతో..**

కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందిన నర్తు రాజేష్ బెంగళూరులోని జిగిని గ్రామంలో శ్రీనివాస సా మిల్లులో పనిచేసేవాడు. ఆ తర్వాత పాయ్ ఇంటర్నేషనల్ షోరూమ్ డెలివరీ బాయ్‌గానూ పనిచేశాడు. అనంతరం ఖతర్ దేశానికి రెండు సార్లు వెళ్లి వెల్డింగ్‌లో హెల్పర్‌గా చేశాడు. అయితే తల్లికి అనారోగ్యంగా ఉండడంతో ఈ ఏడాది జూలై 20న వచ్చేశాడు. తల్లికి వైద్యం చేయించడానికి అప్పులు చేశాడు. కానీ తల్లి ఆరోగ్యం కుదుటపడక ఆమె చనిపోయారు. తర్వాత చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. అప్పులు తీర్చడంతో పాటు ఈజీగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో దొంగగా మారాడు. వచ్చిన డబ్బులతో ఇల్లు కూడా నిర్మించాలనుకున్నాడు. స్కూటీలపై వెళ్తున్న మహిళలు, ఊరి సమీప తోటల నుంచి ఒంటరిగా వచ్చే మహిళల మెడలోని గొలుసులే లక్ష్యంగా రాజేష్ దొంగతనాలకు పాల్పడేందుకు పథక రచన చేశాడు.

**దొంగతనాలివే..**

- ఈ నెల 16 ఉదయం 8 గంటలకు కవిటి మండలం బొర్రపుట్టుగలోని ఓ తోటలో కాలకృత్యాలు తీర్చుకుని ఫోన్‌లో మాట్లాడుకుంటున్న రాజేష్ తన గ్రామానికే చెందిన ఉపాధ్యాయిని భారతి బొర్రపుట్టుగవైపు నడుచుకుంటూ వెళ్లడం చూశాడు. ఆమె మెడలో గొలుసు తెంపేందుకు యత్నించగా ఆమె ప్రతిఘటించడంతో ఊరిలో తన గురించి చెప్పేస్తుందన్న భయంతో రాయి, ఇటుక ముక్కలతో ఆమె తలపై బలంగా దాడి చేశాడు.
- అదే రోజు ఉదయం 10 గంటలకు రాజేష్ తన ద్విచక్రవాహనంతో బెల్లుపడ వెళ్లేసరికి ఇద్దరు మహిళలు స్కూటీపై ఈదుపురం వెళ్తుండటం చూసి వారి వెనుకగా ఫాలో అయ్యాడు. స్కైడ్రాప్ జంక్షన్ దగ్గరలో గిరి ఇటుక బట్టీ సమీపించగానే డ్రైవింగ్ చేస్తున్న మహిళ మెడలో చైన్ తెంపేసి బైక్‌పై పరారయ్యాడు.
- అంతకు ముందురోజు ఉదయం 9 గంటలకు బెల్లుపడ గాంధీ మండపం సమీపంలో ఓ ఒంటరి మహిళ మెడలో బంగారు నెక్లెస్ తెంచుకుని పోయాడు.
- ఇదే నెల 2న మధ్యాహ్నం 2.30 గంటలకు సోంపేట నుంచి స్కూటీపై వస్తున్న ఇద్దరు మహిళలు బాబుతో వెళ్తుండటం చూసి మండపల్లి సమీపించేసరికి డ్రైవింగ్ చేస్తున్న మహిళ మెడలోంచి రాజేష్ చైన్ తెంపే ప్రయత్నం చేశాడు. చైన్ తెగిపోయినా చేతికి రాలేదు.
- నవంబర్ 23న తంపర నుంచి స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు సూదిపుట్టుగ చేరేసరికి డ్రైవింగ్ చేస్తున్న మహిళ మెడలో చైన్ తెంపేశాడు.
- గత నెల 7న తొత్తిడిపుట్టుగ తోట నుంచి రాజపురం వైపు పాలక్యానుతో వస్తున్న ఒంటరి మహిళ మెడలో గొలుసు తెంపేశాడు.

**పట్టుబడ్డాడిలా..**

దొంగిలించిన ఆభరణాలను వేరే ప్రాంతంలో అమ్మేందుకుని కంచిలి రైల్వేస్టేషన్‌కు ఈనెల 21న ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మధ్యాహ్నం 3 గంటలకు కవిటి మండలం కొజ్జిరియా జంక్షన్ వద్దకు చేరి పోలీసులకు దొరికిపోయాడు. రాజేష్ వద్ద నున్న బంగారుసొత్తుతో పాటు స్మార్ట్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వీవీ అప్పారావు ఆధ్వర్యంలో కేసులను చాచక్యంగా ఛేదించిన ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ వి.రవివర్మ, ఏఎస్ఐ గోపాలరావు, పీసీలు బషీర్, ప్రసాద్, శ్రీను, ఈశ్వరరావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ● 129 ఏళ్ల చరిత్ర





క్రిస్మస్ స్పెషల్

ఆంధ్రాబాప్టిస్టు చర్చి

స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఉన్న ఆంధ్రాబాప్టిస్టు చర్చిలో 129 ఏళ్లుగా ఏటా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 1889వ సంవత్సరంలో సంఘం స్థాపించినప్పటికీ 1905 సంవత్సరంలో కెనడాకు చెందిన క్రిస్టియన్ మిషనరీష్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధి ఆర్చి బాల్డ్ ఆధ్వర్యంలో ఫాస్టర్ డబ్ల్యూ.హిగ్గెన్స్ పర్యవేక్షణలో ఈ చర్చిను ప్రారంభించారు. 2015 సంవత్సరానికి 120 ఏళ్లు పూర్తి కావడంతో ఈ చర్చిని పునర్నిర్మాణం చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఫాస్టర్ ఆర్.అప్పాజీ, సంఘం అధ్యక్షుడు డి.సుందర్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ఏడాది క్రిస్మస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ప్రార్థనా గంట అప్పటిదే..**

టెక్కలిలో సెంటినరీ ఆంధ్రాబాప్టిస్టు చర్చిలో సుమారు 129 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రార్థన గంటను ఇప్పటికీ వినియోగిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో చర్చి ఫాస్టర్ ఈ ప్రార్థన గంటను మోగించిన తర్వాత క్రైస్తవ సోదరులు యేసుప్రభువుకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. సుమారు 129 ఏళ్లుగా ఇదే సంప్రదాయం కొనసాగుతోంది.

-టెక్కలి

## జాతీయ వాలీబాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ అండర్-19 స్కూల్‌గేమ్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో తుర్లల మోహన్‌సాయి, మైలపల్లి అప్పన్న, మైలపల్లి లక్ష్మణరావులు ఉన్నారు. తెలంగాణలోని నారాయణపేట వేదికగా ఈనెల 22 నుంచి మొదలైన నేషనల్ స్కూల్‌గేమ్స్ పోటీల్లో వీరు ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు గత నెల 8 నుంచి 10వ వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో విశేషంగా రాణించారు. శ్రీకాకుళం జట్టు విజేతగా నిలవడంలో కీలక భూమిక పోషించడంతో జాతీయ పోటీల్లో చోటు దక్కించుకున్నారు. వీరు జిల్లాకు చెందిన శాప్ వాలీబాల్ కోచ్ కళ్లేపల్లి హరికృష్ణ వద్ద శిక్షణ పొందుతూ రాష్ట్ర,జాతీయస్థాయిలో మెరుస్తున్నారు.

## క్లుప్తంగా

### కళింగాంధ్ర సామాజిక ప్రయాణమే 'నక్షత్ర బాట'



నవలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

**శ్రీకాకుళం కల్చరల్:** కళింగాంధ్ర సామాజిక ప్రయాణమే 'నక్షత్రబాట' నవలని ప్రముఖ రచయిత్రి రమాసుందరి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్ర బాట నవల పుస్తకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం ఉద్యమంలో వీరనారీమణులు సాధించిన విజయాలను నవలలో గొప్పగా రాశారని కొనియాడారు. స్నేహ కళా సమితి అధ్యక్షుడు గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ నక్షత్రబాటను సిక్కోలు ప్రజానీకం మాట్లాడుకునే యాసలో రాయడం అభినందనీయమన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ నవల రాసేందుకు నాలుగేళ్లు పట్టిందన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు చీకటి దివాకర్, తామాడ అరుణ, పైలా అరుణ, గార రంగనాథం, పిల్లా తిరుపతిరావు, సురంగి మోహన రావు, కేతిరెడ్డి శ్రీనివాసరావు, తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, కంచరాన భుజంగరావు, చింతాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### జానపద కళలతో చైతన్యం



ఆకట్టుకున్న కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

**పలాస:** జాన పద ప్రజాకళలను విప్లవీకరించి అవి తిరిగి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని ప్రజాకళా మండలి రాష్ట్ర నాయకుడు కొర్రాయి నీలకంఠం చెప్పారు. విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి ఆ విధంగానే తన జముకుల కథతో శ్రీకాకుళం గిరిజనుల పోరాటాన్ని దేశం నలుదిశలా చాటిచెప్పి ప్రజల్లో చైతన్యం తెచ్చారని గుర్తు చేశారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకళామండలి కళాకారులు తమ ఆటపాటలతో ప్రేక్షకులను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ఎస్ జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మకుమారి, వివిధ ప్రజా సంఘాల నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, జోగి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తం

**ఆమదాలవలస:** సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై గ్రామ స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. పలు రికార్డులు సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, ఆమదాలవలస సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### పోలీసుల అదుపులో దుండగులు!

**శ్రీకాకుళం క్రైమ్:** జిల్లాకేంద్రంలోని కిన్నెర కాంప్లెక్స్ సమీపంలో ఓ వ్యాపారి ఇంట్లో శనివారం రాత్రి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో వెళ్లి దోపిడీకి యత్నించిన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురితో పాటు వీరికి సహకరించిన నగరానికి చెందిన ఓ వ్యక్తిని సైతం ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో ఇద్దరిది తెలంగాణ రాష్ట్రం భద్రాచలం కాగా, ఒకరిది నాగర్‌కర్నూల్‌గా తెలిసింది. ఇందులో ఏ-1 నిందితుడి ఫోన్ కాల్ డేటా ఆధారంగా మిగతా వారిని పట్టుకున్నట్లు సమాచారం. వారం రోజులుగా వ్యాపారి గోవింద్ బ్యాగుతో సొమ్ము తెస్తుండటం, ఇంట్లో వృద్ధురాలైన తల్లి మాత్రమే ఉండటం, ఆమె బంగారు నగలు ధరించి ఉంటుందన్న విషయాన్ని తెలుసుకున్న ఆగంతకులు రెక్కీ వేసినట్లు తెలుస్తోంది.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

**టెక్కలి రూరల్ :** బలరాంపురం సమీపంలో ఆదివారం ఓ ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. టెక్కలి నుంచి పాతపట్నం వైపు సుమారు 10 మంది ప్రయాణికులతో వెళ్తున్న టెక్కలి డిపో బస్సు బలరాంపురం సమీపంలో ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కగా ఉన్న మట్టిలో కూరుకుపోయింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

### రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

**కాశీబుగ్గ:** మందస-సున్నాదేవి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై ఆదివారం ఉదయం మహిళ మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలంలో లభించిన బస్సు టికెట్ ఆధారంగా మృతురాలిని కాశీబుగ్గ పట్టణానికి చెందిన జాడు వేణమ్మ (55)గా గుర్తించారు. ఈమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె తిట్టడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. కాగా, వేణమ్మ బుధవారం నుంచి కనిపించకపోయినా ఫిర్యాదు చేయకపోవడంపై పోలీసులు కుటుంబ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

# తప్పులతో తప్పదు ముప్పు



విద్యార్థులు

- టెన్త్ విద్యార్థుల నామినల్ రోల్స్ సవరణకు ప్రభుత్వం చర్యలు
- తప్పులు, దోషాలు లేకుండా నామినల్ రోల్స్ ఉండేలా అధికారులు చర్యలు
- దోషాలు, తప్పుల సవరణకు నేటితో గడువు పూర్తి
- హెచ్‌ఎంల లాగిన్‌లో ఎడిట్ చేసుకునే వెసులుబాటు



ఓ పాఠశాలలో విద్యార్థుల డేటాను సరిచూస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ:

పదో తరగతి విద్యార్థుల డేటా తయారీని పక్కాగా, పకడ్బందీగా చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ నడుం బిగించింది. ఇప్పటికే విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపుల పర్వం దాదాపుగా పూర్తయ్యింది. పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సైతం ప్రభుత్వం వెల్లడించింది. 2025 మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు జిల్లా నుంచి 28,769 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించారు. జిల్లాలో 590 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

### తప్పులకు మూల్యం తప్పదు..

రానున్న మార్చి 17వ తేదీ నుంచి మొదలుకానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల డేటాతోపాటు వారి వ్యక్తిగత సమాచారం పక్కగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే భవిష్యత్‌లో విద్యార్థుల మార్క్స్ మెమోలో తలెత్తే తప్పులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులనే బాధ్యులను చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఎన్ఆర్‌లను సరిచేసుకోకుంటే.. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని విద్యాశాఖ విద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

### సరిచూసుకోవాల్సిందే..

పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్ సవరణకు ప్రభుత్వం సన్నద్ధమైంది. దీంతో విద్యార్థుల వ్యక్తిగత సమాచారం ముఖ్యంగా విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, విద్యార్థి జన్మదినం, మీడియం, విద్యార్థి ఫొటో, సంతకం, ఆధార్‌కార్డు నంబర్, పుట్టుమచ్చలు, మొదటి, ద్వితీయ భాష, విద్యార్థి వైకల్యం, ఓఎస్ఎస్‌సీ సబ్జెక్ట్/కోడ్, తదితర సమాచారం పక్కాగా ఉండేలా చూడాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశించారు. పొరపాటున కంప్యూటర్‌లో డేటా నమోదు సమయంలో తలెత్తిన దోషాలు, తప్పుల సవరణకు ఈనెల 23వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో 'ఎడిట్' ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే పీహెచ్‌సీ విద్యార్థుల సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసిసిన కాపీని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంబంధిత సెక్షన్‌లో ఒరిజినల్, జిరాక్స్ కాపీలను ఈనెల 27వ తేదీలోగా తీసుకువచ్చి ధ్రువీకరించుకుని వెళ్లాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

### తప్పులకు హెచ్‌ఎంలే బాధ్యులు



జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్‌లో తప్పులు, దోషాలు ఉంటే వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్‌ను ఇచ్చింది. ఈనెల 23వ తేదీ వరకు ఈ అవకాశం ఉంది. హెచ్‌ఎంల లాగిన్‌లో ఎడిట్ చేసుకోవచ్చు. భవిష్యత్‌లో విద్యార్థుల డేటాలో ఉండే తప్పులకు హెచ్‌ఎంలే బాధ్యులవుతారని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

### విద్యార్థులకు అన్యాయం జరగకూడదనే..



పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అన్యాయం జరగకూడదని భావించి పాఠశాల విద్యాశాఖ ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. విద్యార్థుల వివరాల నమోదులో ఎలాంటి దోషాలు, తప్పులకు ఆస్కారం లేకుండా క్షుణ్ణంగా పరిశీలించి కన్ఫర్మ్ చేయాలి. భవిష్యత్‌లో అపార్ నమోదుతోపాటు విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుడదని చూడాలి.

– లియాఖత్ ఆలీఖాన్, అసిస్టెంట్ కమిషనర్, పరీక్షల విభాగం జిల్లా విద్యాశాఖ

# ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ సెమీఫైనల్





శ్రీ విశ్వ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



**సీతమ్మధార:** 'సాక్షి' స్పెల్ బీ రీజినల్ సెమీఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని శ్రీ విశ్వ స్కూల్‌లో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి' వ్యవహరించాయి. వివిధ కేటగిరీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష బాగా రాశామని పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. 'సాక్షి' మీడియా అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్న 'సాక్షి' మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల మేథోశక్తిని పెంచేందుకు సాక్షి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు పర్యవేక్షించగా.. శ్రీ విశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్లు శివాజీ, సూర్యనారాయణ, డీన్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

SAKSHI SPELL Bee 2024-25

### నమ్మకం కలిగింది



సాక్షి స్పెల్ బీ పరీక్ష కోసం కొద్ది రోజులుగా సన్నద్ధమయ్యాను. పరీక్ష బాగా రాశాను. దీంతో మరింత నమ్మకం కలిగింది. సబ్జెక్టును మెరుగుపరుచుకునేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి.

-ఎం.స్ఫూర్తి శ్రీ, పదో తరగతి, శర్వాణి విద్యాలయం, అరసవిల్లి, శ్రీకాకుళం

### అర్థాలు తెలిశాయి



సాక్షి స్పెల్ బీ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో లోతైన అర్థాలు తెలిశాయి. స్టేజీపై మాట్లాడేందుకు మా భాషను మెరుగుపరుచుకోవచ్చు. సాక్షికి ధన్యవాదాలు.

– ఎస్.విష్ణు శ్రీప్రియ, ఏడో తరగతి, కేకేఆర్ గౌతమి స్కూల్, ఎంవీపీకాలనీ, విశాఖపట్నం,

### పరీక్ష బాగా రాశాను



సాక్షి స్పెల్ బీ సెమిఫైనల్ పరీక్ష కోసం మా అమ్మనాన్నతో కలిసి వచ్చాను. పరీక్ష చాలా బాగా రాశాను. స్పెల్ బీ పరీక్షకు సిద్ధమవడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

– వి.సాయి సహన, ఐదో తరగతి, శ్రావణి విద్యాలయం, శ్రీకాకుళం

# పాఠశాలలో తల్లిదండ్రుల ధర్నా



పెద్దమడి గిరిజన సంక్షేమ పాఠశాలలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- 403 మంది విద్యార్థులకు ఐదుగురే ఉపాధ్యాయులు!
- పెద్దమడి గిరిజన సంక్షేమ పాఠశాలలో పాఠాలు చెప్పేవారు కరువు

**మెళియాపుట్టి:** మండలంలోని పెద్దమడి గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా పాఠాల భోధన జరగడంలేదని, తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం పాఠశాల ఆవరణలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నుంచి 10వ తరగతి వరకు 403 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. గతంలో 17 మంది ఉపాధ్యాయులు ఉండేవారని, ప్రస్తుతం కొందరు అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు 36 రోజులుగా ధర్నా చేస్తుండటంతో ఐదుగురు ఉపాధ్యాయులే మిగిలారని, దీంతో పాఠాలు చెప్పే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యుటేషన్‌పై వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులు తెలుగు మీడియం పాఠశాలకు చెందిన వారని, పెద్దమడి పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం వారు కావడంతో వారికి ఉపయోగం ఉండటం లేదన్నారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సోమవారం సీతంపేట ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రం అందిస్తామని చెప్పారు.

### భవిష్యత్ ఏం కావాలి?

పాఠశాలలో 17 మంది ఉపాధ్యాయులకు కేవలం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, మరికొందరు ఉపాధ్యాయులే మిగిలారు. సుమారు 36 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. మాపిల్లల భవిష్యత్ ఏం కావాలి?

– ఎస్.శంకరరావు, పాఠశాల కమిటీ చైర్మన్

### పీఓ దృష్టికి తీసుకెళ్లాం..

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ధర్నాకు వెళ్లారు. ఈ విషయాన్ని సీతంపేట ఐటీడీఏ పీఓ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ముగ్గురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇక్కడికి పంపించారు. ఉన్న స్టాఫ్ 11 మందితో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బోధన నిర్వహిస్తున్నాం.

– అజిత్, ప్రిన్సిపాల్, పెద్దమడి

### ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్

**శ్రీకాకుళం న్యూకాలనీ:** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు దాదాపు రూ.26వేల కోట్లను తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం క్రాంతి భవన్‌లోని సంఘ మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిల విడుదకు ఇంతవరకు కార్యాచరణ రూపొందించకపోవడం తగదన్నారు. 2023 జూలై నాటికి 11వ వేతన సవరణ గడువు ముగిసి 17నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం భావ్యం కాదన్నారు. 11వ వేతన సవరణ చైర్మన్ రాజీనామా చేసిన నూతన చైర్మన్‌ను సైతం నియమించలేదన్నారు. మధ్యంతర భృతి ఊసే లేదని, సరెండర్ లీవ్ చెల్లింపులు, పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, పెండింగ్ బకాయిలపై కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిల్ని విడుదల చేయాలని, సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమబాట తప్పదన్నారు. పదోతరగతికు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సెలవు రోజుల్లోనూ పనిచేసేలా ఉపాధ్యాయులపై అనవసర ఒత్తిడి చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఆన్‌లైన్ యాప్‌లు, డేటా నమోదుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఎస్‌వీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి జి.రమణ, ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, వివద మండలాల కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టెక్కలిలో అధికార దుర్వినియోగం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



**టెక్కలి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో సొంత సామాజికవర్గానికి చెందిన డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, ఆర్డీఓ స్థాయి అధికారులను నియమించుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. దళితులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్యులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తాను ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదంటూ మంత్రి అచ్చెన్న తాజాగా చేసిన వ్యాఖ్యలపై తిలక్ ఘాటుగా సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంతబొమ్మాళి మండలం ఎం.నర్సాపురంలో దళితులపై, కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దళితులపై, టెక్కలి మండలం చాకిపల్లిలో దళిత సామాజిక వర్గానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ చుక్క గున్నమ్మ, ఆమె కుమార్తెపై టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారని గుర్తు చేశారు. నందిగాం మండలం నౌగాం, సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర, దండుగోపాలపురంలో టీడీపీ కార్యకర్తలు కావాలనే కవ్వింపు చర్యలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై దాడులు చేసి తిరిగి వారిపైనే కేసులు పెట్టారని పేర్కొన్నారు. టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో ఓ సామాన్య కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేసి రాజకీయ వేధింపులు చేశారని చెప్పారు. ఇంత జరిగినా ఎటువంటి కక్ష సాధింపులు చేయడం లేదని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు కోసం ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తూ అమరావతిపై వత్తాసు పలుకుతూ అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పదవులు కొట్టేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో జిల్లాకు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, మూలపేట పోర్టు, కిడ్నీ పరిశోధన కేంద్రం, ఉద్దానం ప్రజలకు సురక్షిత నీరు, గొట్టా బ్యారేజ్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అభివృద్ధి పనులు చేశారని, టీడీపీ పాలనలో ఒక్క శాశ్వతమైన పథకం ఉందా అని ప్రశ్నించారు.

# దేవీ.. డబ్బులేవీ?

- సుమారు కోటి రూపాయలు వసూలు చేసిన నౌపడ మహిళ
- తిరిగి చెల్లించకపోవడంతో ఆందోళనలో బాధితులు



బాధితుల వాట్సాప్‌కు పంపిన బంగారు బిస్కెట్ల ఫొటోలు



దేవి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

**సంతబొమ్మాళి :** తమ వద్ద లక్షలాది రూపాయలు అప్పులు చేసిన ఓ మహిళ తిరిగి చెల్లించడం లేదంటూ నౌపడ గ్రామానికి చెందిన పలువురు బాధితులు ఇటీవల పోలీసులను ఆశ్రయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నౌపడ గ్రామానికి చెందిన దుక్కు దేవికి హైదరాబాద్‌లో ప్రైవేటు బ్యాంకులో జాబ్ చేస్తున్న వ్యక్తితో వివాహమైంది. తన భర్త బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడంటూ దేవి అదే గ్రామానికి చెందిన బంధువులు పైల భాగ్యలక్ష్మి వద్ద రూ.32 లక్షలు, చుక్క బేబి వద్ద రూ.18లక్షలు, దాలమ్మ వద్ద రూ.3 లక్షలు, టెక్కలికి చెందిన దమయంతి వద్ద రూ.35లక్షలు, ఇలా మరి కొందరి వద్ద నుంచి మొత్తం సుమారు కోటి రూపాయలు వరకు అప్పులు చేసింది. అప్పులు ఇచ్చినవారు అడిగిన ప్రతిసారీ లక్షకు రూ.రెండు లక్షలు ఇస్తానని, బంగారు బిస్కెట్లు, బంగారు దేవుడి ప్రతిమలు ఇస్తానంటూ నమ్మబలికేది. అవి తన వద్ద ఉన్నాయంటూ బంగారు బిస్కెట్ల ఫొటోలు తీసి బాధితుల వాట్సాప్ నెంబర్‌కు పంపించేది. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇరువర్గాలను పోలీసులు పిలిపించడంతో వారం రోజుల్లో చెల్లిస్తానని దేవీ చెప్పడంతో బాధితులు శాంతించారు. అయినా మాట నిలబెట్టుకోలేకపోవడంతో బాధితులందరూ దేవి ఇంటి వద్దకు శుక్రవారం వెళ్లగా ఆమె పరారైనట్లు గుర్తించి కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఇంటి ముందు ధర్నా చేయడానికి సిద్ధం కాగా, ఆ సమయంలో దేవి బాధితులతో ఫోన్లో మాట్లాడి రెండు రోజుల్లో వస్తానని చెప్పడంతో అందరూ వెనుదిరిగారు. అయినా ఇంతవరకు దేవి రాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మా దృష్టికి వచ్చింది..

దేవి అనే మహిళ అప్పులు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదన్న విషయం నా దృష్టికి కొద్దిరోజులు క్రితం బాధితులు తీసుకువచ్చారు. ఇరువర్గాలను పిలిచి మాట్లాడితే వారం రోజుల్లో తిరిగి ఇస్తానని తెలిపారు. రాతపూర్వకంగా బాధితులు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు. ఎవరైనా ఫిర్యాధు చేస్తే కేసు నమోదు చేస్తాం.

– నారాయణస్వామి, ఎస్ఐ, నౌపడ

# వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



బూర్జ: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వందాన ప్రసాద్



టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మణరావు

**టెక్కలి రూరల్:** మండలంలోని కె.కొత్తూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణరావు అనే యువకుడు శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా కె.కొత్తూరు వద్ద లారీని ఆపి రోడ్డు దాటుతున్న అబ్దుల్ బాషా అనే వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ కింద పడటంతో గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

**రెండు బైకులు ఢీ..**

**బూర్జ:** మండలంలోని ఏపీపేట సమీపంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడటంతో బూర్జ గ్రామానికి చెందిన దంపతులు వందాన ప్రసాద్, మమతలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. ఎప్పట్లాగే శనివారం రాత్రి కూడా విధులకు వెళ్తుండగా ఆస్పత్రికి వెళ్తుండగా కొల్లివలస జంక్షన్ వెళ్లేసరికే షిఫ్ట్ సమయం ముగిసిందని గుర్తించి స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. ఏపీపేట వద్దకు వచ్చేసరికి పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బైక్ ఢీకొనడంతో దంపతులు కింద పడిపోయారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్సులో రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. పంపించారు. క్షతగాత్రులకు ప్రసాద్‌కు కుడి చేయి, కుడి కాళ్లు ఇరిగిపోయినట్లు అక్కడ వైద్యులు గుర్తించారు. ప్రసాద్ తండ్రి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం. ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.